క్లుప్తంగా

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో .. టమాట 20, పచ్చిమిర్చి 50, బెండ 40, కాకర 60, దొండ 30, దోస 30, ఆలు 25, చామ 45, కీర 30, బీర 50, వంకాయ 50, గోకర 50, బీన్స్ 120, బీట్‌రూట్ 30, క్యాప్సికమ్ 50, క్యాబేజీ 20, క్యారెట్ 45, చిక్కుడు 70, ఉల్లి 100 (5 కేజీలు), ములక్కాయలు (2) 10 , క్యాలీఫ్లవర్ (1) 40 సొరకాయ (కేజీ) 20, అల్లం 280, వెల్లుల్లి 160.

రేపు దివ్యాంగులకు బస్‌పాస్ మేళా

రాయదుర్గం: దివ్యాంగుల కోసం ప్రత్యేకంగా పటాన్‌చెరు బస్టాండ్ ప్రాంగణంలో బస్‌పాస్ మేళా నిర్వహించడం జరుగుతుందని ఏటీఎం మహేష్‌కుమార్, సీఐ ప్రశాంత్‌కుమార్ మంగళవారం తెలిపారు. గురువారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. దివ్యాంగులు సదరమ్ సర్టిఫికెట్, ఆధార్‌కార్డు, ఫొటో, రూ.50లను తీసుకు రావాలని సూచించారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం, పరిసరాల్లో అర్హులైన వారంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

నటి స్పందన సందడి



మాదాపూర్: మాదాపూర్‌లోని బజాజ్ ఎలక్ట్రానిక్స్‌లో గెలాక్సీ సూపర్‌సేల్ ఆఫర్‌ని మంగళవారం నటి స్పందన పిల్లి నిర్వాహకులతో కలసి ప్రారంభించింది. సెల్‌ఫోన్ కొనుగోలు చేసే వారికి ఇదొక మంచి అవకాశం అని, అన్ని రకాల సామ్‌సాంగ్ గెలాక్సీ మొబైల్స్‌పై ఆఫర్ ఉంటుందని తెలిపారు.

అందరికీ నెగెటివ్

పటాన్‌చెరు టౌన్: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. మంగళవారం 14 మందికి కోవిడ్ ర్యాపిడ్ టెస్టులు చేశారు. అందులో అందరికీ నెగెటివ్ వచ్చిందని నిర్వాహకుడు మనోహర్ తెలిపారు. ఆర్టీపీసీఆర్ టెస్టులు 15 మందికి చేసినట్లు చెప్పారు.

ఘన వ్యర్థాల పారబోత

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని పారిశ్రామికవాడలో గుర్తుతెలియని వ్యక్తులు మంగళవారం తెల్లవారుజామున ఘన వ్యర్థాలను పారబోశారు. దీంతో పరిసరాలు దుర్గంధం వెదజల్లాయి. పారిశ్రామికవాడల్లో తరచు గుర్తుతెలియని వ్యక్తులు వ్యర్థ జలాలను పారబోయటం, ఘన వ్యర్థాలను సంచుల్లో వేసి పారవేయటం జరుగుతున్నా పీసీబీ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదని పారిశ్రామిక వాడల ప్రజలు ఆరోపిస్తున్నారు. వ్యర్థ ఘన పదార్థాలను పారేసిన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ముగ్గురు అదృశ్యం

మియాపూర్: ఇంటి నుండి బయటకు వెళ్లిన మహిళ తిరిగి రాని సంఘటన మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మియాపూర్‌లోని గోకుల్ ఫ్లాట్స్‌లోని బీజేఎస్ ఎన్‌క్లేవ్‌లో పరుచూరి సుజాత(51) కుటుంబ సభ్యులతో నివాసముంటుంది. కొన్ని రోజుల నుండి సుజాత అనారోగ్యంతో బాధపడుతుంది. ఈనెల 20వ తేదీన రాత్రి కుటుంబ సభ్యులు యదావిధిగా నిద్రించారు. తెల్లవారు జామున చూడగా సుజాత ఇంట్లో కనిపించలేదు. పలుచోట్ల వెతికినా ఆచూకి లభించలేదు. దీంతో ఆందోళన చెందిన కుమారుడు మణికంఠ మియాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మరో ఘటనలో..

భార్యతో గొడవపడిన భర్త అదృశ్యమయ్యాడు. చందానగర్ పోలీస్‌స్టేషన్ ఎస్ఐ నాగేశ్వర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం... శేరిలింగంపల్లి దుబే కాలనీకి చెందిన బండారి సంతోష్‌కుమార్(36) ప్లంబర్ . కొంతకాలంగా సంతోష్‌కుమార్ మద్యానికి బానిసై తరచూ భార్యతో గొడవపడేవాడు. ఈ క్రమంలో ఈ నెల 16వ తేదీ మద్యం సేవించి రాగా భార్య సావిత్రి గొడవ పడింది. 17వ తేదీ ఉదయం లేచే సరికి భర్త సంతోష్‌కుమార్ కనబడలేదు. రాత్రి అయిన ఇంటికి రాలేదు. దీంతో భార్య సావిత్రి చుట్టుపక్కల, బంధువుల ఇళ్లల్లో వెతికినా ఫలితం లేకపోవడంతో చందానగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

పటాన్‌చెరులో..

పటాన్‌చెరు టౌన్: ఓ యువతి అదృశ్యమైంది. పటాన్‌చెరు ఎస్ఐ రామానాయుడు కథనం ప్రకారం... పట్టణంలోని గౌతమ్‌నగర్ కాలనీకి చెందిన యాదమ్మ కూతురు మనీషా(23) ఆరో తరగతి వరకు చదివి ఇంటివద్దే ఉంటుంది. సోమవారం ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయింది. దీంతో యాదమ్మ తెలిసిన వారి వద్ద, బంధువుల వద్ద వెతికినా కూతురి ఆచూకీ లభించలేదు. కూతురు అదృశ్యంపై తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.





దీప్తిశ్రీనగర్ రేగులకుంట చెరువులో అలుముకున్న గుర్రపు డెక్క

చెరువులు మురుగుమయం

- ప్రబలిన దోమలు.. జ్వరాలబారిన ప్రజలు
- అలుముకున్న గుర్రపు డెక్క
- చెరువుల చుట్టుపక్కల ప్రాంతాల్లో అపరిశుభ్రత

చందానగర్: చెరువులు, కుంటలు కలుషితమై దోమలకు ఆవాసాలుగా మారుతున్నాయి. అండర్ డ్రైనేజీ, వ్యర్థ జలాలు ఇలా అన్నీ చెరువుల్లోకి చేరిపోతున్నాయి. దీనికితోడు గుర్రపు డెక్క పెరగడం, మరోవైపు చెరువు పరిసరాల్లో వ్యర్థాలు పడేయడంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. పరిసర ప్రాంతాలన్నీ అపరిశుభ్రంగా తయారవుతున్నాయి. పలు కాలనీల్లో మురుగునీరు రోడ్లపై పారుతోంది. చెరువులు, నాలా పరీవాహక ప్రాంతాలవాసులకు దోమలతో కంటి మీద కునుకు లేకుండా పోతోంది. మియాపూర్, చందానగర్ డివిజన్ల పరిధిలో గంగారం చెరువు, గురున్నాథం చెరువు, పటేల్ చెరువు, బచ్చుకుంట, రామసముద్రం చెరువు, న్యూ కాలనీ చెరువు, మక్తమహబూబ్‌పేట్ చెరువు, రేగులకుంట చెరువు, నాయినమ్మ కుంట చెరువు, కిందికుంట చెరువులు కలుషితమయ్యాయి.

- ఏటా చెరువుల్లో గుర్రపుడెక్క తొలగించేందుకు లక్షలాది రూపాయలు వెచ్చిస్తున్నా ఆశించిన ఫలితం రావడం లేదు. చెరువుల్లో మురుగు నీరు చేరకుండా చెరువులను సుందరీకరిస్తామన్నా ప్రజాప్రతినిధులు, అధికారుల హామీలు అలాగే ఉన్నాయి.
- చెరువుల్లో ఫాగింగ్ చేయకపోవడంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి.
- మియాపూర్ డివిజన్‌లో పటేల్ చెరువు, చందానగర్‌లోని గంగారం చెరువు సుందరీకరణ పనులను ఐదేళ్ల క్రితం చేపట్టారు. నేటికీ పనులు ముందుకుసాగడం లేదు. కనీసం చెరువుల్లో మురుగు చేరకుండా చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చుట్టు పక్కల కాలనీల నుండి మురుగు నీరంతా చెరువులోకి చేరి దుర్వాసన వెదజల్లుతోంది. వీటితో పాటు డివిజన్ పరిధిలోని మిగతా చెరువులను కూడా అభివృద్ధి పేరుతో చెరువు కట్టలు వేసి వదిలేశారు.
- దోమల వృద్ధిని అరికట్టేందుకు రెండేళ్ల నుండి డ్రోన్‌ల సాయంతో చెరువుల్లో దోమల మందులు పిచికారీ చేస్తున్నారు. అయితే దీనివల్ల ఆశించిన ఫలితాలు రావడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి.
- చెరువులు, నాలా పరిసర ప్రాంతాల్లో నివాసముండే వారు సాయంత్రం, రాత్రిపూట తలుపులు, కిటికీలు తెరిస్తే ఇక అంతే సంగతులు. దోమలతో కునుకుండదు.
- కాలనీ, బస్తీల్లో సంబంధిత అధికారులు ఫాగింగ్ చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని 15రోజులకు ఒకసారి కూడా ఫాగింగ్ చేయడం లేదని స్థానికులు వాపోతున్నారు.
- డెంగ్యూ, మలేరియా, జ్వరాల బారిన పడి ఆస్పత్రుల పాలవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.
- చెరువుల్లో మురుగు నీరు కలవకుండా, గుర్రపు డెక్క విస్తరించకుండా చర్యలు తీసుకోవడంతో బాటు చెరువు చుట్టు పక్కల కాలనీలో చెత్త వేయకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మున్నూరు కాపు సంఘం భవనానికి సీడీపీ నిధులు



మున్నూరు కాపు సంక్షేమ సంఘం సభ్యులకు మంజూరు పత్రాలను అందజేస్తున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

హఫీజ్‌పేట్ : కొండాపూర్ డివిజన్ పరిధిలోని మార్తాండనగర్‌లో హఫీజ్‌పేట్ మున్నూరు కాపు సంఘం భవన నిర్మాణానికి రూ.21 లక్షలు ఎమ్మెల్యే (సీడీపీ ఫండ్స్)తో నిర్మాణం జరుగుతుందని ఎమ్మెల్యే గాంధీ పేర్కొన్నారు. మంగళవారం మున్నూరు కాపు సంక్షేమ సంఘం సభ్యులకు రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు పంపిన మంజూరు పత్రాలను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కొండాపూర్ డివిజన్ సమగ్ర, సంతులిత అభివృద్ధిలో భాగంగా మున్నూరు కాపు సంఘం సభ్యుల విజ్ఞప్తి మేరకు భవన నిర్మాణం కొరకు నిధులు మంజూరు చేయవలసిందిగా కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపించామన్నారు. నిధులు మంజూరు అయిన వెంటనే మున్నూరు కాపు సంఘం భవనం నిర్మాణ పనులు ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో హఫీజ్‌పేట్ మూన్నూరు కాపు సంఘం సభ్యులు చైర్మన్ కొన్నవేణి రమేష్, అధ్యక్షులు పాగుల సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి వాసాల శ్రీనివాస్, పేరుక రమేష్, బుడుగు తిరుపతిరెడ్డి, గాజుల మహేందర్, బొల్లం సంతోష్, బత్తుల సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

తుదిదశలో మన ఊరు- మన బడి పనులు

ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: విద్యారంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుడుతూ సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన 'మన ఊరు మనబడి కార్యక్రమం ద్వారా పటాన్‌చెరు నియోజకవర్గంలో చేపట్టిన పనులు తుది దశకు చేరుకున్నాయని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. పనుల పురోగతిపై మంగళవారం నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో తొలివిడతలో ఎంపికైన 55 పాఠశాలల్లో చేపట్టిన పనులు శరవేగంగా సాగుతున్నాయన్నారు. వచ్చేనెల 12 లోపు పనులు పూర్తిచేసి, ఆయా పాఠశాలలకు అప్పగించాలని ఆదేశించారు. అమీన్‌పూర్ మండల పరిధిలోని కిష్టారెడ్డిపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనులు మందకొడిగా సాగడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ప్రభాకర్, జెడ్పీటీసీలు సుధాకర్ రెడ్డి, కుమార్ గౌడ్, ఎంపీపీ దేవానందం, కార్పొరేటర్లు, మెట్టు కుమార్ యాదవ్ పుష్ప నగేష్, మున్సిపల్ చైర్మన్ లలితా సోమిరెడ్డి, వైస్ చైర్మన్ రాములు గౌడ్, నరసింహగౌడ్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

అసలే ఇరుకు..ఆపై సైకిల్ ట్రాక్



బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కు చుట్టూ సైకిల్ ట్రాక్ కోసం ఏర్పాటు చేసిన గుంతలు

వెంకటేశ్వరకాలనీ: బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కు చుట్టూ ప్రధాన రహదారిని కాంప్రహెన్సివ్ రోడ్ మేనేజ్‌మెంట్ ప్రాజెక్ట్(సీఆర్ఎంపీ) ఏజెన్సీ నిర్వహిస్తోంది. రోడ్లపై గుంతలు పడినా, ఫుట్‌పాత్‌లు దెబ్బతిన్నా కొత్తగా రోడ్డు వేయాలన్నా, తవ్వాలన్నా సీఆర్ఎంపీ నిర్వహణలోనే చేపట్టాలి. అయితే గత కొంత కాలంగా కేబీఆర్ పార్కు చుట్టూ సైకిల్ ట్రాక్ నిర్మించాలనే ప్రతిపాదనలు ఉన్నాయి. ఇందులో భాగంగా రెండేళ్లుగా ఫుట్‌పాత్‌లను ఆనుకుని సైకిల్ ట్రాక్ బొల్లార్డ్స్ కోసం గుంతలు తీశారు. వర్షాలకు ఈ గుంతలు నిండిపోయి పార్కుకు వచ్చే వాకర్లు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సైకిల్ ట్రాక్ నిర్మాణం పేరుతో పార్కు చుట్టూ సదరు సంస్థ రోడ్డును ఛిద్రం చేసింది. నాలుగైదు సార్లు గుంతలు తీసి పూడ్చి రూ.లక్షల్లో నిధులు వృథా చేశారు. జీహెచ్ఎంసీ అనుమతులు లేకుండానే ఇష్టానుసారంగా పార్కు చుట్టూ సైకిల్ ట్రాక్ నిర్మాణ పనుల కోసం తవ్వకాలు చేపడుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అసలే పార్కు చుట్టూ రోడ్డు ఇరుగ్గా ఉందని ఈ సైకిల్ ట్రాక్ నిర్మాణం చేపడితే సమస్య జఠిలంగా మారుతుందని, వాహనాలు ముందుకు వెళ్లే పరిస్థితి ఉండదని కేబీఆర్ పార్కుకు వచ్చే వాకర్లు, సందర్శకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు మంత్రి కేటీఆర్‌కు ఫిర్యాదు కూడా చేశారు. తక్షణం పార్కుచుట్టూ సైకిల్ ట్రాక్ నిర్మాణ పనులు నిలిపివేయాలని తీసిన గుంతలను పూడ్చాలని వారు డిమాండ్ చేస్తున్నారు. సీఆర్ఎంపీ నిర్వాకంతో పార్కు చుట్టూ రోడ్డు అధ్వానంగా మారిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వీఓఏల సమస్యల పరిష్కారంలో సర్కార్ విఫలం



మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జున్

పటాన్‌చెరు టౌన్: వీఓఏల సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జున్ అన్నారు. మంగళవారం పటాన్‌చెరు పట్టణంలో 36 రోజులుగా వీఓఏలు చేస్తున్న సమ్మె శిబిరానికి వెళ్లి వారికి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీఓఏ డిమాండ్స్ న్యాయమైనవన్నారు.కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

ఆల్విన్‌కాలనీ: శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలో కల్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ పథకానికి దరఖాస్తు చేసుకున్న పలువురు లబ్ధిదారులకు మంగళవారం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 40 మంది లబ్ధిదారులకు రూ.40,04,640 లక్షల ఆర్థిక సహాయాన్ని అందజేసినట్లు తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, ఊట్ల చంద్రారెడ్డి, ఎండి ఇబ్రహీం, సత్యనారాయణ, సంతోష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అదుపు తప్పి.. డివైడర్‌ను ఢీకొని..

రాయదుర్గం: అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొని యువకుడు మృతి చెందిన సంఘటన గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. యూసుఫ్‌గూడలో నివాసముంటూ నానక్‌రాంగూడ కారు వాష్‌సెంటర్‌లో పని చేస్తున్న చింటు(20) అనే యువకుడు సోమవారం రాత్రి 10 గంటల ప్రాంతంలో విధులు ముగించుకొని బోరబండకు వెళుతూ నానక్‌రాంగూడ ఔటర్‌రింగురోడ్డు సర్వీస్ రోడ్డుపై ముందు వాహనాన్ని ఓవర్‌టేక్ చేస్తూ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టాడు. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా రేణుక ఎల్లమ్మ కల్యాణం

మియాపూర్: మియాపూర్‌లోని మక్తమహబూబ్‌పేటలో బీఆర్ఎస్ నాయకులు గుండె దయానంద్ ఆధ్వర్యంలో శ్రీ రేణుక ఎల్లమ్మ కల్యాణ మహోత్సవంను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక అలంకారం చేశారు పూజా కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌కు శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు.

జీపు, యాక్టివాను ఢీకొన్న జైలో వాహనం

- యాక్టివాపై ఉన్న వ్యక్తి మృతి
- పరారీలో జైలో వాహనం డ్రైవర్



రాయదుర్గం: అతివేగంగా వచ్చిన జైలోక్యాబ్ వాహనం ఓ జీపును, ఆ తర్వాత యాక్టివాను ఢీ కొట్టడంతో యాక్టివాపై ఉన్న యువకుడు మృతి చెందిన సంఘటన గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వరంగల్ జిల్లా కరీమాబాద్‌కు చెందిన సాయితరుణ్(21) నానక్‌రాంగూడలోని ఓ హోటల్‌లో పనిచేస్తూ గౌలిదొడ్డిలోని పీజీ హాస్టల్‌లో నివాసం ఉంటున్నాడు. మంగళవారం ఉదయం 6.40 గంటలకు నానక్‌రాంగూడ కొత్త రోడ్డులో సుమధుర అపార్ట్‌మెంట్ సమీపంలో వేగంగా వచ్చిన జైలో క్యాబ్ వాహనం మొదట జీపును ఢీకొట్టింది. అనంతరం యాక్టివాను కూడా ఢీకొట్టడంతో యాక్టివాపై ఉన్న సాయితరుణ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అతన్ని వెంటనే సమీపంలోని కాంటినెంటల్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు తెలిపారు. కాగా జైలో వాహనం డ్రైవర్ పరారీలో ఉన్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కు అందజేత



చెక్కును అందజేసిన ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు తదితరులు

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ డివిజన్ వెంకటేశ్వరనగర్‌కు చెందిన సాయిగణేష్‌కు అత్యవసర చికిత్స నిమిత్తం మంజూరైన ముఖ్యమంత్రి సహాయనిధి రూ.75 వేల ఎల్‌ఓసి పత్రాన్ని మంగళవారం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధి నిరంతరం సేవలను అందిస్తూ ఆపదలో ఉన్న వారికి ఆపన్న హస్తంలా ఆదుకుంటుందన్నారు. కార్యక్రమంలో మాదాపూర్ డివిజన్ అధ్యక్షుడు ఎర్రగుడ్ల శ్రీనివాస్‌యాదవ్, నాయకులు నాయినేని చంద్రకాంత్ రావు, ఎండి ఇబ్రహీం, మమత తదితరులు పాల్గొన్నారు.

సమ సమాజాన్ని ఆకాంక్షించిన సాహితీవేత్త విశ్వనాథరెడ్డి



సభలో మాట్లాడుతున్న తెలుగు విభాగం అధ్యక్షుడు ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు

రాయదుర్గం: సమ సమాజాన్ని ఆకాంక్షించిన సాహితీవేత్త ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి అని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ తెలుగు విభాగం అధ్యక్షుడు ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని హెచ్‌సీయూలో తెలుగు విభాగం ఆధ్వర్యంలో కేతు విశ్వనాథరెడ్డి సంతాప సభను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం జరిగిన సంతాపసభలో ఆయన మాట్లాడుతూ ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి కథలు వ్రాయడం, కంటీ ముందు వేర్లు, బోధి నవలలను రాశారని గుర్తు చేశారు. తెలుగు విభాగం ఆచార్య గోనానాయక్ మాట్లాడుతూ కింది వర్గాలవారిని ఎంతగానో ప్రోత్సహించే వారని అన్నారు. కార్యక్రమంలో ఆచార్యులు విజయలక్ష్మీ, డాక్టర్ భూక్యాతిరుపతి, డాక్టర్ బాణాల భుజంగరెడ్డి, డాక్టర్ డి విజయకుమారిలు విశ్వనాథరెడ్డి సేవలను కొనియాడారు.

రక్తదానం.. ప్రాణదానమే



రక్తదానం చేస్తున్న బీఎల్‌వై చారిటబుల్ ట్రస్టు సభ్యులు

హఫీజ్‌పేట్ : రక్తదానం..ప్రాణదానమని బీఎల్‌వై చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు బోయిని మహేష్ యాదవ్ అన్నారు. మంగళవారం హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని ఓల్డ్ హఫీజ్‌పేట్‌లో బీఎల్‌వై చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ బోయిని అనూష యాదవ్ ఆధ్వర్యంలో ఉచితంగా వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. అనంతరం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రముఖ సంఘ సేవకులు స్వర్గీయ బోయిని లక్ష్మయ్య యాదవ్ 6వ వర్ధంతి సందర్భంగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం జరిగిందన్నారు. ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ బోయిని శ్రీకాంత్ యాదవ్, జనరల్ ఫిజిషియన్ డాక్టర్ శ్రీకర్ సుమారు 200 మందికి వైద్య పరీక్షలు చేశారు. సుమారు 80 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో హఫీజ్‌పేట్ డివిజన్ బీజేపీ కంటెస్టెడ్ కార్పొరేటర్ బోయిని అనుషాయాదవ్, బోయిని మల్లేష్‌యాదవ్, రాజేష్ యాదవ్, ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్, రాచమల్ల నాగేశ్వరరావుగౌడ్, శ్రీధర్‌గౌడ్ తదితరులు పేర్కొన్నారు.

డివిజన్ల అభివృద్ధికి నిధులు కేటాయించండి



వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే, కార్పొరేటర్ల బృందం

పటాన్‌చెరు టౌన్: భారతీనగర్, పటాన్‌చెరు, రామచంద్రాపురం డివిజన్‌ల పరిధిలో చేపట్టబోయే అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని కోరుతూ జీహెచ్ఎంసీ కమిషనర్ లోకేష్‌కుమార్‌కు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి నేతృత్వంలోని కార్పొరేటర్ల బృందం మంగళవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం బల్దియ ప్రధాన కార్యాలయంలో కార్పొరేటర్లు మెట్టు కుమార్‌యాదవ్, పుష్పనగేష్, సింధు ఆదర్శ్‌రెడ్డిలతో కలిసి కమిషనర్ లోకేష్‌కుమార్‌తో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా శరవేగంగా అభివృద్ధి చెందుతున్న మూడు డివిజన్ల పరిధిలో ప్రజలకు మౌలిక వసతులు కల్పించేందుకు అభివృద్ధి పనులు చేపట్టాల్సి వస్తుందని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి కమిషనర్ దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించిన కమిషనర్ త్వరలోనే నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.

నేలకొరిగితే..నిలబెట్టారు



పడిపోయినప్పుడు...

మాదాపూర్: నేలకొరిగిన ఓ చెట్టుకు మళ్లీ ప్రాణం పోశారు. మాదాపూర్‌లోని నోవాటెల్ వద్ద 30 ఏళ్ల వయసు ఉన్న చెట్టు ఇటీవల కురిసిన వర్షానికి నేలకొరిగింది. విషయం తెలుసుకున్న బీజేపీ నేత గంగుల రాధాకృష్ణ యాదవ్ చొరవ తీసుకుని వాటా ఫౌండేషన్, నోవాటెల్ యాజమాన్యం సహకారంతో వృక్షానికి తిరిగి జీవం పోశారు.



ప్రాణం పోసుకున్న చెట్టు వద్ద ఫౌండేషన్ సభ్యులు

ఆన్‌లైన్ క్విజ్ కాంపిటీషన్.. పోస్టర్ ఆవిష్కరణ

బంజారాహిల్స్: రాజీవ్‌గాంధీ ఆన్‌లైన్ క్విజ్ కాంపిటీషన్‌కు సంబంధించిన పోస్టర్‌ను మంగళవారం ఏఐసీసీ కార్యదర్శి రోహిత్‌చౌదరి, ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు సి. రోహిణ్‌రెడ్డి గాంధీ భవన్‌లో ఆవిష్కరించారు. జూన్ 17న వరకు క్విజ్‌లో పోటీల్లో పాల్గొనేందుకు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చునన్నారు. 18న ఆన్‌లైన్ క్విజ్ పోటీలు జరుగుతాయని రోహిణ్‌రెడ్డి తెలిపారు. విజేతలకు ఎలక్ట్రిక్ స్కూటర్, ల్యాప్‌టాప్‌లు, సెల్‌ఫోన్లు, ట్యాబ్‌లు అందజేయనున్నట్లు తెలిపారు. యువత పెద్ద సంఖ్యలో ఈ పోటీల్లో పాల్గొనేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. అలాగే సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం చేస్తున్నట్లు వారు తెలిపారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రోహిత్‌చౌదరి, రోహిణ్‌రెడ్డి తదితరులు